క్లుప్తంగా

మహాశివరాత్రి వేడుకల్లో మంత్రి తలసాని దంపతులు



రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా శివరాత్రి కార్యక్రమాల్లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ తలసానికి జ్ఞాపికను అందజేశారు.

అశోక్‌నగర్‌లో జోడో యాత్ర

చిలకలగూడ: అఖిలభారత కాంగ్రెస్ కమిటీ నేషనల్ కోఆర్డినేటర్ దీపక్‌జాన్ నేతృత్వంలో బౌద్ధనగర్ డివిజన్ అశోక్‌నగర్‌లో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా దీపక్‌జాన్ మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్యాస్ ధర రూ.500, నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు, రైతులకు రూ. 2 లక్షల వ్యవసాయరుణం, పెట్రోలు, డీజిల్ ఇతర నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చారు. నియంతృత్వ పాలన సాగిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లకు సరైన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

కరపత్రం సాహిత్యంపై పరిశోధనకు ఓయూ డాక్టరేట్



వి.వెంకట్

ఉస్మానియా యూనివర్సిటీ: కరపత్రం సాహిత్యం పై తొలిసారి పరిశోధన చేసిన వేల్పుకొండ వెంకట్‌కు ఓయూ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.సూర్యధనుంజయ్ పర్యవేక్షణలో కరపత్రం సాహిత్య ప్రపంచ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాందించారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి జేఏసీ నాయకునిగా పనిచేసిన వెంకటేష్ బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

లక్ష్మీనరసింహ స్వామి అఖండ జ్యోతియాత్రకు ఘన స్వాగతం

చిక్కడపల్లి: శ్రీలక్ష్మీనరసింహ స్వామి 29వ అఖండ జ్యోతి యాత్రకు ఘనస్వాగతం పలికారు. మాజీ కార్పొరేటర్ టి.శైలజ గోపాల్ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లిలోని సుధా హోటల్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ సతీమణి కె.ఉమాలక్ష్మణ్ ప్రత్యేక పూజలు చేశారు. అఖండ జ్యోతి యాదగిరిగుట్ట వరకు కొనసాగుతుంది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.గోపాల్, బీజేపీ మహంకాళీ జిల్లా ఉపాధ్యక్షురాలు అరుణ జయేందర్ బాబు, వనజ, పద్మజ, ఉమా, విశిష్ట, వసంత, రాధా, జయేందర్‌బాబు, నర్సింగ్‌రావు, వాణీశ్వర శాస్త్రి, శంకర్‌గౌడ్, సురేష్‌రాజు, శ్రీను, ఆకుల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాలా పనుల పర్యవేక్షణ

నల్లకుంట: నల్లకుంట శంకరమఠం రోడ్డులో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ నాలా నిర్మాణ పనులను ఆదివారం ఉదయం 10:30 గంటలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యవేక్షిస్తారని బీజేపీ నల్లకుంట డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేష్‌యాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

20న ఆంధ్ర బాలానంద సంఘం వార్షికోత్సవం

కాచిగూడ: బాలానందం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 20న రవీంద్రభారతిలో ఆంధ్ర బాలానంద సంఘం 83వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ చిత్తరంజన్, కార్యదర్శి జేవీ కామేశ్వరి తెలిపారు. బాలానందం బాలలచే సాంస్కృతిక ప్రదర్శన, వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని వారు పేర్కొన్నారు. వేడుకలకు ప్రముఖ కవి డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, ప్రముఖ రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి, లలిత సంగీత దర్శకులు పవీ సాయిబాబా, మిమిక్రీ శ్రీనివాస్, మృత్యుంజయ శర్మ పాల్గొంటారని తెలిపారు.

భారతీ సిమెంట్స్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ

రంగారెడ్డినగర్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులకు చింతల్ ద్వారకాపురి కాలనీలోని శివాలయంలో కామాక్షి అధినేత శ్రీనివాస్‌గౌడ్, భారతి సిమెంట్స్ ప్రతినిధి మల్లారెడ్డి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మహా శివరాత్రి రోజు ఉపవాస దీక్ష చేపట్టడం ఎంతో పుణ్యమని, దీక్ష విరమించిన వారికి పండ్లు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. సదాశివుడు అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో భారతి సిమెంట్స్ బ్రాంచ్ మేనేజర్ టి.సతీష్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హర హర మహాదేవ

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి

సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో శనివారం మహాశివరాత్రి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. తెల్లవారుజామునుంచే భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు.స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులు ఇబ్బంది పడకుండా అన్నిచర్యలూ తీసుకున్నారు.



కుమ్మరిబస్తీలోని శివాలయంలో అభిషేకం నిర్వహిస్తున్న తలసాని



సనత్‌నగర్‌లోని హనుమాన్ దేవస్థానంలో అభిషేకం చేస్తున్న వెల్లాల రామ్మోహన్

లాలాపేట: డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి కుటుంబ సమేతంగా కీసరలోని రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, బండ చంద్రారెడ్డి తదితరులు కుటుం సమేతంగా తార్నాకలోని శివాంజనేయ దేవాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు.

చిలకలగూడ: చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఫౌండర్‌ట్రస్టీ నాగులూరి సాయిబాబా నేతృత్వంలో లింగోద్భవం, శివపార్వతుల కళ్యాణంతోపాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు.

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాన్యాసక రుద్రాభిషేకం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు గుర్రం పవన్‌కుమార్ గౌడ్, బాలరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

సనత్‌నగర్: అమీర్‌పేట్‌లోని కుమ్మరిబస్తీలోని హనుమాన్ దేవాలయంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శివలింగానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సనత్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు వెల్లాల రామ్మోహన్ అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు.

రసూల్‌పురా: కార్ఖాన లోని చౌడేశ్వరీ దేవి సహిత పంచ లింగేశ్వర స్వామి ఆలయంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అదేవిదంగా తాడ్‌బండ్ తవాయిపురాలోని శ్రీ భవాని శివలింగేశ్వర స్వామి ఆలయంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి దంపతులు పూజలు చేశారు.



తార్నాకలోని శివాంజనేయ దేవాలయంలో పూజలు చేస్తున్న మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి



సీతాఫల్‌మండిలో రామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



పద్మారావునగర్‌లోని శ్రీ సాయిబాబా దేవాలయంలో మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



చిలకలగూడలో శివుని చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న గణనాథుని సెట్టింగ్

నేటి నుంచి టీటీడీ ఆలయ బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19 (నేటి)నుంచి మార్చి 1వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రావు తెలిపారు. ఫిబ్రవరి 19న అంకురార్పణ, 20న ధ్వజారోహణ, 24న గరుడ వాహనసేవ, 27న రథోత్సవం, 28న చక్రస్నానం, మార్చి 1న పుష్పయాగం తదితర పూజలు జరుగుతాయన్నారు. వీటితోపాటు ప్రతిరోజూ స్వామివారి విశేష వాహన పూజలు ఉంటాయన్నారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, పూలమాలలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.



జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయం

విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి



వేడుకలను ప్రారంభిస్తున్న డీఐజీ రమేష్‌రెడ్డి

కాచిగూడ: విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఐజీ ఎం.రమేష్‌రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి రాణి స్కూల్, బూర్గుల రామకృష్ణారావు బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించగలుగుతారన్నారు. విద్యార్థులకు విజ్ఞానంతో కూడిన విద్య అవసరమని, ఆ దిశగా చదవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. స్వాతంత్ర్య అమృతోత్సవాల్లో భాగంగా 75 ఏళ్లలో దేశాన్ని పాలించిన ప్రధానుల పరిపాలన విశేషాలతో కూడిన నృత్యరూపకం, స్వాతంత్ర సంగ్రామంలో చేసిన పోరాట సమరయోధుల ఇతివృత్తంతో కూడిన నాటకాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువతి మండలి అధ్యక్షురాలు శేషు విఠల్, కార్యదర్శి నివేదిత కుమార్, కరస్పాండెంట్ మంజులదేవి, హెడ్ మిస్ట్రెస్ ఉదయలక్ష్మి, శ్రీవాణి, గాలి గాయత్రి పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు

చింతల్: ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ టీఆర్ఎస్ పాలనలో అప్పుల పాలైందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ప్రజాగోస- బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శనివారం భగత్‌సింగ్‌నగర్‌లోని శక్తి కేంద్రంలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొమ్మిదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడని, ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ ను అప్పుల పాలు చేశాడని ఆరోపించారు. కేసీఆర్ గ్రాఫ్ ప్రజల్లో బాగా పడిపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు భయం పట్టుకుందని, అందుకే ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న వారిపై ఎమ్మెల్యేలు తమ అనుచరులతో దాడులు చేయిస్తున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు పత్తి సతీష్, సదానందం, శక్తి కేంద్ర ఇంఛార్జ్ ఆదిత్య, బూత్ అధ్యక్షులు నాగరాజు, రాజ్‌పుత్ రోహిత్, సంగం, నాయకులు భానుచందర్, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓఆర్ఆర్ మూసీ వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మరణించాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన మేరకు.. రాజస్థాన్‌కు చెందిన ధూళీ చంద్ (47) ఉపాధి కోసం మరి కొందరితో కలిసి ఓఆర్ఆర్ రోడ్డు మరమ్మతు పనులు చేయడానికి వచ్చారు. శనివారం సాయంత్రం ధూళీచంద్ పనులు పూర్తి కాగానే ఓఆర్ఆర్ మూసీ వంతెన వద్ద రేలింగ్ పక్కన నిలబడ్డాడు. అదే సమయంలో స్విఫ్ట్ కారులో డ్రైవర్ చల్లమల్లి శరత్ (20) అతడి స్నేహితులు వెంకటేశ్, నవీన్, ధీరజ్, ఆజెయ్ తార్నాసీపేట్ నుంచి వేగంగా వస్తూ నిలబడి ఉన్న ధూళీచంద్‌ను ఢీకొట్టారు. దీంతో తీవ్ర గాయాలై ధూళీచంద్ అక్కడికక్కడే మరణించగా వెంకటేశ్, ధీరజ్‌కు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. స్నేహితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య

సికింద్రాబాద్: గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. లాలాగూడ-మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ల మధ్యలోని పట్టాలపై శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో సుమారు 50 ఏళ్ల పైబడిన గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కాగా, మృతుడు బ్లూ అండ్ బ్లాక్ కలర్ టీషర్ట్, షార్ట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న హోంగార్డు మృతి

బంజారాహిల్స్: బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ హోంగార్డు దీపక్ సింగ్ శనివారం మృతి చెందారు. ఈనెల 7న దీపక్ సింగ్ విధులు నిర్వహిస్తున్న క్రమంలో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. సిబ్బంది అతడ్ని వెంటనే జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అతని చికిత్స కోసం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది కలిసి రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందించారు. కాగా పది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దీపక్ సింగ్‌ను శుక్రవారం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఇదిలా ఉండగా, దీపక్ సింగ్ బ్లూకోల్ట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. దాదాపు పదేళ్లకుపైగా ఫిలింనగర్ సెక్టార్‌లో పనిచేస్తున్న ఇతను ఆ ప్రాంతంలో అందరికీ సుపరిచితుడు. దీపక్ సింగ్ విషయాన్ని గుర్తించిన అపోలో ఆసుపత్రి యాజమాన్యం అతడి చికిత్సకు అయిన రూ.14 లక్షలను మాఫీ చేసింది. దీంతో అపోలో యాజమాన్యానికి పోలీసు అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి

ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్



మాట్లాడుతున్న ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్ సూచించారు. శనివారం దోమలగూడలో బీజేపీ కార్నర్ మీటింగ్ జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ టి.రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ముషీరాబాద్‌లో బీజేపీ విజయం సాధించడం తధ్యమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సి.కె.శంకర్‌రావు, రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేష్‌రామ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షులు మహేందర్‌బాబు, కార్యదర్శి ప్రభాకర్‌గంగపుత్ర, సురేష్‌ముదిరాజ్, ముషీరాబాద్ ఎస్సీ మోర్చా కన్వీనర్ పి.పరశురామ్, శంకర్ లాల్, పాండు, బాబు, రంజిత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలి

యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌యాదవ్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమానికి ప్రజాదరణ లభిస్తోందని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో ముషీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్‌లోని బాదం గల్లీ, గగన్‌పహాడ్, బరఫ్‌గల్లీలో ప్రారంభమైన హాత్‌సే హాత్ జోడో యాత్రకు అనిల్ కుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీరాముల యాదగిరి, ముషీరాబాద్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వి.డి.కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు ధర్మేందర్, స్థానిక నేతలు సాయిబాబా, రమేష్, దశరథ్, పి.లక్ష్మణ్, బాబురావు, గుర్రం శంకర్, పవన్, వెంకట్‌రెడ్డి, రాజు, రుషికేశ్వర్‌రావు, మేడి సురేష్, విజయ్, బబ్లూ పాల్గొన్నారు.

గాంధీనగర్ డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి: కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ.. మెరుగైన వసతులు కల్పించి గాంధీనగర్ డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ పేర్కొన్నారు. జవహర్‌నగర్‌లో బీజేపీ నేతలు ఎం.శ్రీనివాస్‌రావు, హర్షయాదవ్, శివకుమార్, ప్రవీణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో శనివారం ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్‌లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తున్నామన్నారు. ఉల్లిగడ్డ బస్తీలో ప్రెషర్ నీటి సరఫరాను పరిష్కరించామన్నారు. డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయన్నారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, బీజేపీ నియోజవర్గ కన్వీనర్ రమేష్‌రామ్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నేతలు శ్రీకాంత్, మహమూద్, ఆకుల సురేంద్, సురేష్, సాయికుమార్, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

నిజామాబాద్ ఏజీపీ ప్రదీప్‌కు సన్మానం



ఏజీపీ ప్రదీప్‌ను సన్మానించి అంబేద్కర్ పుస్తకాన్ని అందచేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: నిజామాబాద్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా నియమితులైన ఓయూ పూర్వవిద్యార్థి ఎండల ప్రదీప్‌ను ఘనంగా సన్మానించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏజీపీ ప్రదీప్‌ను బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.విజయరావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి శాలువతో సన్మానించి డాక్టర్. బీఆర్ అందబ్కేర్ పుస్తకాన్ని అందచేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఎండల ప్రదీప్ ఏజీపీగా ప్రభుత్వం నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకట్, చందు, క్రాంతి, రామకృష్ణ, వంశీ, కార్తీక్, కృష్ణ, ప్రవీణ్‌సురేష్, యోగి తదితరులు పాల్గొన్నారు.

గోపన్‌పల్లిలో అదృశ్యం..బెంగళూర్‌లో ప్రత్యక్షం

గచ్చిబౌలి: గోపన్‌పల్లిలో అదృశ్యమైన ముగ్గురు పిల్లలను బెంగళూర్‌లో ఉన్నట్లు కనుగొన్న గచ్చిబౌలి పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చడంతో మిస్సింగ్ కేసు సుఖాంతమైంది. గచ్చిబౌలి సీఐ గోనె సురేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపల్లిలోని విద్యానికేతన్‌లో 8వ తరగతి చదివే కె.అభిరామ్(14), నాల్గవ తరగతి చదివే బీబీ నజ్మీన్(13) గోపన్‌పల్లిలో ట్యూషన్‌కు వెళుతుంటారు. బెంగళూర్‌లో 7వ తరగతి చదివి గోపన్‌పల్లికి వచ్చిన పి.చరణ్(14) పరిచయం అయ్యాడు. బెంగళూర్ సిటీ బాగుంటుందని చెప్పడంతో ముగ్గురు ఇంట్లో చెప్పకుండా వెళ్లారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు ట్యూషన్ నుంచి ఆటోలో నేరుగా లంగర్‌హౌస్‌కు వెళ్లారు. అక్కడి నుంచి కర్నాటక బస్సులో యాదగిరి వెళ్లి యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బెంగళూర్‌కు వెళ్లారు. చరణ్ స్నేహితుడు రితిక్ వద్దకు వెళ్లారు. నజ్మీన్ తండ్రి ముక్రా అలం ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు చరణ్ ద్వారా బెంగళూర్‌కు వెళ్లే అవకాశం ఉందని భావించారు. బెంగళూర్‌కు వెళ్లిన పోలీసులు మెజిస్టిక్ సిటీ ఏరియాలో ముగ్గురు పిల్లలను అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చి శనివారం తల్లిదండ్రులకు అప్పగించారు. బెంగళూర్ సిటీ బాగుంటుదని చూసేందుకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

ఎక్కడ చూసినా చెత్త గుట్టలే..

రంగారెడ్డినగర్: జంట సర్కిళ్ల పరిధిలో పారిశుధ్య నిర్వహణ అటకెక్కింది.. కాలనీలు, బస్తీల్లోని ఏ రోడ్డు చూసినా రోజుల తరబడి చెత్తను తరలించక పోవడంతో గుట్టలను తలపిస్తున్నాయి.. సూరారం కాలనీ డివిజన్ షాపూర్‌నగర్ హెచ్‌ఎంటీ సొసైటీ కాలనీలో నాలుగైదు రోజులుగా రోడ్లపై డంప్ చేస్తున్న చెత్తను తరలించడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోందని, దోమల కారణంగా రాత్రిళ్లు నిద్రకు దూరవుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోజువారీ పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆర్ట్..అదుర్స్

నిజాంపేట్‌లోని సద్గురు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్న 4వ తరగతి విద్యార్థి సత్యవోలు మౌక్తిక మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గోడపై 8 అడుగుల ఎత్తు, 15 అడుగుల వెడల్పులో పరమశివుని చిత్రాన్ని గీసి అబ్బుర పరిచింది.. సద్గురు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు సత్యవోలు రాంబాబు కుమార్తె మౌక్తిక చిన్నతనం నుండే విభిన్న పెయింటింగ్‌లలో ప్రతిభను చాటుతోంది..

– నిజాంపేట్



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379